# ప్రత్యేకహోదా సాధనకు పట్టు పట్టండి

### పార్లమెంట్ సభ్యులకు తులసిరెడ్డి సూచన



**వేంపల్లె:జూలై 20 ప్రభాతవార్త :**
రాష్ట్రానికి సంజీవని వంటి ప్రత్యేకహోదా సాధించేందుకు పార్లమెంట్ సభ్యులు పట్టు పట్టాలని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి సూచించారు. పార్లమెంట్ వర్షకాల సమావేశాల్లో రాష్ట్రానికి చెందిన సభ్యులు ప్రత్యేక హోదా అమలుకు కృషి చేయాలన్నారు. ప్రత్యేకహోదా అమలు ద్వారా ఉపాది హామీ, సర్వశిక్ష అభియాన్ తదితర కేంద్ర ప్రాయోజిత పథకాలపై కేంద్ర 90 శాతం నిధులు భరిస్తుందన్నారు. అలాగే అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంక్ తదితర విదేశీ ఆర్థిక సంస్థల సహాయంతో అమలవుతున్న పథకాలకు 90100 శాతం మేర నిధులు కేంద్రం భరిస్తుందన్నారు. అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, మణిపూర్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ప్రత్యేకహోదా అమలవుతోందన్నారు. 2014, ఫిబ్రవరి 20న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఏపి రాష్ట్రానికి ఐదేళ్ల పాటు ప్రత్యేకహోదా అమలు చేస్తామని ప్రకటించారన్నారు. మార్చి 1న ప్రత్యేకహోదాపై తీర్మానం చేసి అమలు చేయాలని ప్రణాళిక సంఘాన్ని ఆదేశించినట్లు తెలిపారు. ఆ తర్వాత బిజెపి అధికారంలోకి వస్తే పదేళ్ల పాటు ప్రత్యేకహోదా అమలు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రత్యేకహోదా అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం దీనిపై ఛాలెంజ్ గా తీసుకుని ప్రత్యేకహోదా అమలు సాధనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.


ప్రభాత

# కడప-అన్నమయ్య





తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మంగళవారం 21 జూలై 2026


## ప్రైవేటీకరణకు నిరసనగా డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన



**రాజంపేట, జూలై 20 ప్రభాతవా**
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణకు నిరసనగా రాజంపేటలో డాక్యుమెంట్ రైటర్లు ఒక రోజు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం విధులను బహిష్కరించి డాక్యుమెంట్ రైటర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సబ్ రిజిస్ట్రార్ వ్యవస్థలో ప్రైవేటీకరణ తగదని స్పష్టం చేశారు. దీనివల్ల ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లతో పాటు, ఆందోళనకు సిఐటియు మద్దతు ఇచ్చింది.

### విద్యార్థులను ప్రోత్సహించడమే..

# ప్రభుత్వ లక్ష్యం

**విద్యతోనే జీవితానికి వెలుగు, దేశ భవిష్యత్తు**

**జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి**



ప్రోత్సాహక నగదును అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్లు

**మదనపల్లె, జులై 20 ప్రభాతవార్త :**
విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జ్, రోడ్లు భవనాల మౌళిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖామంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా షైనింగ్ స్టార్స్-2026, మై స్కూల్-మై ఫ్రెండ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, విద్యాశాఖ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో పోటి తత్వాన్ని పెంపొందిచడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. జిల్లాను విద్యా ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను అభినందించారు. రాయలసీమలో జిల్లా ప్రథమ స్థానం, రాష్ట్రంలో 9వ స్థానంలో నిలవడం గర్వకారణం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్‌లు విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఏ మాత్రం తీసిపోరని వారి ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకే షైనింగ్ స్టార్స్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిన అందుకొన్న పురస్కారం జీవితాంతం గుర్తుండేలా మరింత కృషి చేయాలని సూచించారు. ఒక విద్యార్థి విజయం మరొకరికి స్ఫూర్తిగా మారాలన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఐఏఎస్, ఐపిఎస్, ఇంజనీరింగ్, డాక్టర్లు కావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తుని, విద్యతోనే వ్యక్తిత్వ వికాసం సాధ్యం అవుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా వేలాది మంది విద్యార్థులు లబ్ధిపొందుతున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులే అన్నమయ్య జిల్లా భవిష్యత్తుకు బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు రూ.20 వేలు ప్రోత్సాహక నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 188మంది విద్యార్థులకు రూ.37,60లక్షలు నగదు ప్రోత్సాహకం అందజేయడం సంతోషకరమన్నారు. తల్లికి వందనంతో పాటు మధ్యాహ్న భోజనం కూడా నాణ్యమైనదిగా వడ్డించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ సుబ్రమణ్యం, డైరెక్టర్ అనూరాధ, ఇంటర్‌మీడియట్ జిల్లా అధికారి రవి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

### లింగాల కుడి కాల్వకు

# నీరు విడుదల చేయాలి

**కాలువలో కూర్చుని రైతుల వినూత్న నిరసన**

**సాగునీటి కోసం ఆందోళన**



**పులివెందుల, జూలై 20, ప్రభాత వార్త :**
చిత్రావతి రిజర్వాయర్ నుంచి లింగాల కుడి కాల్వకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. వైఎస్సార్ జిల్లా పులివెందు ల నియోజకవర్గంలోని లింగాల మండలంలో సోమవారం రైతులు లింగాల కుడి కాలువలో కూర్చుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు బాబురెడ్డి మాట్లాడుతూ సాగునీరు అందక, మరోవైపు వర్షాలు కూడా లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులు నెలకొంటున్నప్పటికీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించకపో వడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.లింగాల కుడి కాల్వకు నీరు విడుదల కాకపోవడంతో లింగాల, పులివెందుల, వేముల మండలాల పరిధిలోని రైతులు తీవ్ర సాగునీటి కొరతను ఎదుర్కొంటు న్నారని తెలిపారు. ప్రస్తుతం పంటలకు అత్యవసరంగా నీరు అవసరమని, ఆలస్యం చేస్తే పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.చిత్రావతి రిజర్వాయర్‌లో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ లింగాల కుడి కాల్వకు నీటిని విడుదల చేయకపో వడం సరికాదని రైతులు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి కాల్వకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

### పారదర్శక పాలన, నాణ్యమైన పౌర సేవలకు

# దక్కిన గౌరవం

**అన్నమయ్య జిల్లాలో ఐఎస్ఓ గుర్తింపు పొందిన తొలి గ్రామపంచాయతీగా పీలేరు**

**జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



ఐఎస్ఓ గుర్తింపును అందజేస్తున్న జిల్లా కలెక్టర్

**పీలేరు, జూలై 20, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లాలో ఐఎస్ఓ గుర్తింపు పొందిన తొలి గ్రామపంచాయతీగా పీలేరు నిలిచిందని... ఇందుకు కృషి చేసిన అధికారులను అభినందిస్తున్నామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు.సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లో పీలేరు గ్రామపంచాయతీకి జారీ చేసిన ఐఎస్ఓ సర్టిఫికెట్లను పీలేరు గ్రామపంచాయతీ డెవలప్మెంట్ అధికారి రవీంద్రారెడ్డికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా అత్యుత్తమ పాలన, పారదర్శకత, నాణ్యమైన పౌర సేవలు అందిస్తున్న 23 గ్రామపంచాయతీలకు అంతర్జాతీయ ప్రమాణాల ఐఎస్ఓ గుర్తింపు లభించిందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా పీలేరు మేజర్ గ్రామపంచాయతీకి కూడా ఐఎస్ఓ గుర్తింపు లభించడం సంతోషకరమన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో పారదర్శక పాలన, మెరుగైన పరిపాలనా విధానాలు, ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు తీసుకున్న చర్యలకు ఈ గుర్తింపు నిదర్శనమన్నారు. పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మరియు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రత్యేక చొరవ, వారి సలహాలు సూచనలు పాటించడం వల్ల గ్రామపంచాయతీకి ఈ అరుదైన గుర్తింపు లభించిందని అధికారులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఏ. రాధమ్మ, పీలేరు డిప్యూటీ ఎంపీడీవో యుగంధర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వందేళ్ల నాటి బాటకు అడ్డు

### కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు



**మదనపల్లె క్రైం, జూలై 20 ప్రభాతవార్త**
తరతరాలుగా వస్తున్న ప్రజల బాటను ఆక్రమించి గమ్యస్థానానికి వెళ్లకుండా అడ్డుపడుతున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకుని రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కోరుతూ అన్నమయ్య జిల్లా సదుం మండలం, తిప్పనాయునిపల్లి గ్రామానికి చెందిన బాధితులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పనాయన పల్లి రైతులకు చెందిన భూముల వద్దకు వెళ్లే దారిని అదే గ్రామానికి చెందిన మునినాథరెడ్డి, ఆయన కుమారులు, ప్రతాప్‌రెడ్డి, దేవేంద్ర రెడ్డిలు కలిసి రాత్రికి రాత్రే రాతి తూములు వేసి పూర్తిగా మూసివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బాట ఈనాటిది కాదని, తరాల కాలం నుండి వస్తోందని, ప్రభుత్వ మ్యాప్‌లలో కూడా ఈ దారి స్పష్టంగా నమోదైదన్నారు. దారి మూసివేతపై ఇప్పటికే స్థానిక ఎమ్.ఆర్.ఓ పలుమార్లు విన్నవించినప్పటికీ, వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి, సర్వేయర్ల ద్వారా సరిహద్దులను పరిశీలింపజేసి తమకు న్యాయం చేయాలని, మూసివేసిన దారిని తెరిపించి రాకపోకలకు మార్గం చూపించాలని విజ్ఞప్తి చేశారు.

## యువకుడి హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

**ఇన్‌స్టాగ్రాం పట్టించింది..**

**3నెలలుగా పరారీలో ఉన్న హంతకులు**

**డెయిరీ ఫారంలో పనిచేస్తున్న యువకుడి హత్య కేసులో ఇద్దరి అరెస్ట్**



**ప్రొద్దుటూరు క్రైం, జులై 20, ప్రభాతవార్త:**
3 నెలలుగా పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న హత్య కేసు నిందితులను ఇన్‌స్టాగ్రాం పట్టించింది. ఇన్‌స్టాగ్రాంలో అప్పుడప్పుడు యాక్టివ్‌గా ఉంటున్న నిందితుడి కదలికలను గుర్తించిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, సెల్‌టవర్ లొకేషన్‌తో ఇద్దరు హంతకులను అరెస్టు చేశారు. ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని మోడమీదిపల్లి గ్రామంలో జరిగిన హత్య కేసు వివరాలను ఏఎస్పీ విభూకృష్ణ సోమవారం మీడియాకు వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన మున్నా కుమార్ మోడమీదిపల్లిలోని ఓ డెయిరీ ఫారంలో పనిచేస్తూ ఏప్రిల్ 7న అనుమానాస్ప స్థితిలో మృతి చెందాడు. మృతుడి మామ రామ్ పరమేష్ ఫిర్యాదు మేరకు ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన స్థలాన్ని పరిశీలించగా మున్నా కుమార్ మెడపై నైలాన్ తాడుతో గొంతు బిగించిన ఆనవాళ్లు గుర్తించారు. అదే దెయిరీ ఫారంలో పనిచేస్తున్న దీపు కుమార్, బిర్జు కుమార్ ఘటన అనంతరం పరారావడంతో వారిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. శవపరీక్ష నివేదికతో పాటు ఇతర వైద్య నివేదికల ఆధారంగా మున్నా కుమార్ నైలాన్ తాడుతో గొంతు బిగించి హత్యకు గురైనట్లు నిర్ధారణ అయింది. దీంతో కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటన అనంతరం నిందితులు సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి పోలీసులకు చిక్కకుండా పరారయ్యారు. నివాస ప్రాంతాలను తరచూ మార్చుకుంటూ 3 నెలలుగా తప్పించుకుతిరిగారు. ఈ క్రమంలో మొదటి నిందితుడు దీపు కుమార్ ఇన్‌స్టాగ్రాంలో అప్పుడప్పుడు యాక్టివ్‌గా ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇన్‌స్టాగ్రాం ఆధారంగా లభించిన సాంకేతిక సమాచారం, సెల్ టవర్ లొకేషన్ విశ్లేషణ, నిఘా చర్యలతో నిందితుల కదలికలను గుర్తించారు. ఈ మేరకు సోమవారం ప్రొద్దుటూరు పట్టణ శివార్లలోని రెండు కులాయిలు సమీపంలో దీపు కుమార్, బిర్జు కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల అరెస్టు కోసం ప్రొద్దుటూరు అదనపు ఎస్పీ విభూకృష్ణ ఆదేశాల మేరకు రూరల్ సీఐ నాగభూషణ్, ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు హైదరాబాదు, బీహార్‌లోని పలు ప్రాంతాలు, విజయవాడతో పాటు ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టి చివరకు నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో ఇన్‌స్టాగ్రాం కీలక ఆధారంగా మారిందని పోలీసులు తెలిపారు.

## పెరిగిన ఎరువుల ధరలు రైతుల్లో ఆందోళన



**దువ్వూరు, జూలై 20, ప్రభాతవార్త:**
పశ్చిమ ఆసియా యుద్ధం ప్రభావంతో మన దేశానికి దిగుమతి అయ్యే మిశ్రమ ఎరువుల ముడి పదార్థాల రవాణాకు అడ్డంకిగా మారింది. దీంతో రవాణా ఖర్చులు పెరగడంతో రాష్ట్రంలోని ఆయా కంపెనీల ఎరువుల ధరలు అమాంతం పెంచుకుంటూ పోతున్నారు. రసాయనిక ఎరువులు తయారు చేసేందుకు కావలసిన ముడి పదార్థాలు ఎక్కువగా ఇతర దేశాల నుండే దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. దీంతో రవాణా ఖర్చులతో పాటు ముడీ సరుకు కూడా ధరలు పెరిగిపోవడంతో మిశ్రమ ఎరువులు అయిన 20:20:0:15, 28:28, 14:26:14, 13:0:45 ఎరువుల ధరలు పెరిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎదవల ధరలు పెరగడంతో వ్యవసాయం పెను భారంగా మారుతుంది. కేవలం యూరియా, డిఏపి మినహా మిగిలిన ఎరువులు అన్ని బస్తాకు ఒక రబి సీజన్ కు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు గాను సుమారు 300 నుండి 800 వరకు ధర పెరిగింది. దీంతో రైతులకు పెట్టుబడితో పాటు ఇతర ఖర్చులు పెరిగిపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అలాగే డిఏపి, యూరియా రైతులు కొనాలంటే ప్రభుత్వ రూపొందించిన యాప్ ద్వారానే కొనాలి. ఆ యాప్ లో ఎలా నమోదు చేసుకోవాలో ఎక్కడికి వెళ్లి చేసుకోవాలో తెలియక రైతులు అవస్థలు పడుతున్నారు. రైతులకు అవసరమైన రసాయనిక ఎరువులు పూర్తి స్థాయిలో దొరకడం లేదు. అలాగే డిఏపి యూరియా కూడా అందుబాటులో లేకపోవడంతో రైతులు యాప్ ద్వారా కొనుగోలు చేయలేక పోతున్నారు. ముఖ్యంగా మిశ్రమ ఎరువులైన 20:20:0:13 1400 రూపాయలు ఉండగా ప్రస్తుతం 2150కి పెరిగింది. రెండు మూడు రోజుల్లో తిరిగి 150 రూపాయలు పెరిగి 2300కు చేరుతుందని వ్యాపారస్తులు బాహాటంగా చెబుతున్నారు. అలాగే 28:28:0 గతంలో 2500 రూపాయలకు వ్యాపారస్తులు విక్రయిస్తున్నారు. తాము సంచి పైన ఉన్న ధరనే విక్రయిస్తున్నామని ఇందులో తమ పాత్ర ఏమీ లేదని పేర్కొంటున్నారు. మిశ్రమ ఎరువులతో పాటు పొటాష్, అమ్మోనియం సల్ఫేట్ తదితర ఎరువులు కూడా ధరలు పెరగడంతో రైతులకు పెను భారంగా మారుతుంది. ప్రస్తుతం గతంలోని రసాయనిక ఎరువుల కొరకు ఎకరాకు 10వేలు ఖర్చు చేయగా ప్రస్తుతం 16వేల రూపాయలు ఖర్చు చేయవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు. గత ఖరీఫ్ సీజన్‌కు ఈ సీజన్ కు ఎకరాకు 6వేల రూపాయలు పెట్టుబడి పెరుగుతుంది. నేలలు సారవంతం అయితే ఎరువుల వినియోగం తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం కూలీల కొరత, ఎరువుల ధరలు సక్రమంగా లేకపోవడంతో రైతులు రసానిక ఎరువుల వైపే మొగ్గు చూపుతున్నారు. అధిక దిగుబడులు సాధించడానికి రైతులు ఎక్కువగా మిశ్రమ ఎరువులను వాడుతున్నారు. దీంతో ఎరువుల కృత్రిమ కొరత కూడా ఏర్పడుతుంది. ప్రభుత్వం అధిక మొత్తంలో యూరియా, డిఏపి సరఫరా చేస్తే కొంతైనా మేలు జరిగే అవకాశం ఉంది. యాప్ ద్వారా కాకుండా గతంలో మాదిరే యూరియా, డిఏపి కూడా విక్రయించాలని కోరుతున్నారు. అలాగే మిశ్రమ ఎరువులను కూడా రైతులకు అందుబాటు ధరలో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు భావిస్తున్నారు.

## విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ కండక్టర్‌పై దాడి

### కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**మైదుకూరు, జులై 20, ప్రభాతవార్త:**
విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ కండక్టర్‌పై ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన బ్రహ్మంగారి మఠం మండలంలో చోటుచేసుకుంది.అందిన వివరాల ప్రకారం, మైదుకూరు డిపో బస్సు నందు పోరుమామిళ్ల-కడప మార్గంలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కండక్టర్ ఎన్.వి. నరసింహులు (బ్యాడ్జ్ నెం. 411400)పై అంబవరం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మద్యం మత్తులో దాడి చేసినట్లు సమాచారం.ఈ దాడిలో కండక్టర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కింది పెదవి, కుడి దవడ భాగం, ఛాతీపై గాయాలు కావడంతో పాటు శరీరంపై గోకిన కారణంగా రక్తస్రావం జరిగినట్లు తెలుస్తోంది.సంఘటనపై సమాచారం అందుకున్న బ్రహ్మంగారి మఠం మండల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి గల కారణాలు, నిందితుల వివరాలపై విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగిపై దాడి జరగడం పట్ల మైదుకూరు డిపో సహోద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తూ, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

## ప్రజా ఫిర్యాదులను పారదర్శకంగా పరిష్కరించాలి

### జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా



**కడప, జూలై 20, ప్రభాతవార్త:**
ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించి అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ డా. నిధీమీనా డిఆర్వో మల్లికార్జునుడు, ఎస్డీసి వెంకటపతి లతో కలిసి.. ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించి, అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.పీజీఏఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్న ఆమె, ప్రతి ప్రభుత్వ శాఖ కార్యాలయంలో పీజీఏఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రజలు సులభంగా తమ అభిప్రాయాన్ని నమోదు చేసేలా కనిపించే ప్రదేశాల్లో క్యూ ఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని, పొంతనలేని నివేదికలు సమర్పించకుండా వాస్తవ సమాచారంతో నివేదికలు అందించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఏఆర్ఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కక్ష సాధింపులకే కన్నం .. 48 గంటల్లోనే భారీ చోరీ

### ఇద్దరు వ్యక్తుల అరెస్ట్ చేసి కేసు నమోదు .. డిఎస్పి కృష్ణమోహన్



పోలీసుల అదుపులో నిందితులు

**లక్కిరెడ్డిపల్లి, జూలై 20, ప్రభాతవార్త :**
కక్ష సాధింపులకే కన్నం చేసి 48 గంటల్లోనే 210 గ్రాములు బంగారం బారీ చోరికి పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కి పంపుతున్నట్లు రాయచోటి డిఎస్పి కృష్ణమోహన్ పేర్కొన్నారు సోమవారం లక్కిరెడ్డిపల్లె సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుడు గురువారం కోనంపేట సంతకు వెళ్లి కూరగాయల అమ్ముకోవడానికి వెళ్లగా ఇదే ఆసరాగా తీసుకున్న గాలివీడుకు చెందిన చెప్పాలి కాశి తన సోదరుడైన తిరుపతికి చెందిన సాయికుమార్ ఇద్దరూ కలిసి ఎవరు లేని సమయంలో ఇంట్లో గోడ పగలగొట్టి 210 గ్రాములు బంగారాన్ని అపహరించకపోయారని 17వ తేదీన గాలివీడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని ఈ మేరకు ఎస్పి ధీరజ్ కొనిబిల్లి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించి సోమవారం గాలివీడు పేరం క్రాస్ వద్ద ఇద్దరిని అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి 210 గ్రాముల బంగారాన్ని ఏటిఎమ్ కార్డు ఒక బైకును సెల్ఫోన్ స్వాధీనం చేసుకొని ముద్దాయిలును అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు ముద్దాయిలు చెప్పాలి కాశి డ్రైవర్ గా పనిచేసేవాడని తన మిత్రుడు తిరుపతికి చెందిన సాయికుమార్ ఎలక్ట్రికల్ పని చేసుకునే వాళ్ళని అదే పనిగా కక్షతో గోడలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారని ఆయన తెలియజేశారుఈ మేరకు నిందితులను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్కు పంపుతున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐ ప్రసమరాజు నాయక్ గాలివీడు ఎస్సై నర్సింహారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు

## హార్టికల్చర్ హబ్‌కు కలెక్టర్ స్థల పరిశీలన

**కురబలకోట జులై 20 ప్రభాతవార్త.**
కూటమి ప్రభుత్వం అన్నమయ్య జిల్లాలో ఏర్పాటు చేయనున్న హార్టికల్చర్ హబ్ కు జిల్లా కలెక్టర్ నీశాంత్ కుమార్ భూ పరిశీలన నిర్వహించారు. సోమవారం సాయంత్రం కురబలకోట మండలం కంటేవారి పల్లి సమీపంలోని జగనన్న కాలనీ వద్దనున్న భూములను కలెక్టర్ పరిశీలించారు. ఇదివరకే ఏపీ ఇండస్ట్రియల్ పా కేటాయించిన భూములను ఆయన పరిశీలించారు. ఆ భూములకు సంబంధించి సమగ్ర నివేదికలను సమర్పించాలని కురబలకోట త హసిల్దార్ ధనుంజయులను కలెక్టర్ ఆదేశించారు. మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# టెట్ కోచింగ్‌కు విశేష స్పందన

## 90 మంది ఉపాధ్యాయుల హాజరు



**బద్వేలు అర్బన్, జూలై 20, ప్రభాతవార్త:** రాష్ట్రోపాధ్యాయ సంఘం బద్వేల్ రీజియన్ ఆధ్వర్యంలో బద్వేలు జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో టెట్ పరీక్షకు సిద్ధమవుతున్న ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆంగ్లభాష బోధనలో 25 సంవత్సరాల అనుభవం కలిగిన ప్రముఖ ఉపాధ్యాయుడు కోవెల ప్రసాద్ రెడ్డి ఈ శిక్షణను అందించారు. సుమారు మూడున్నర గంటల పాటు సాగిన ఈ శిక్షణలో టెన్సెస్, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, యాక్టివ్‌పాసివ్ వాయిస్, డైరెక్ట్‌ఇండైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపారిజన్, డిక్షనరీ స్కిల్స్, వొకాబులరీ, సెంటెన్స్ నిర్మాణం, ఆర్టికల్స్ వినియోగం తదితర అంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. అలాగే టెట్ పరీక్షల్లో వచ్చే ప్రశ్నల సరళి, తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు సాధించే మెళకువలను కూడా వివరించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాజులపల్లి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ, కోవెల ప్రసాద్ రెడ్డి బోధనా విధానం ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి దాదాపు 90 మంది ఉపాధ్యాయులు హాజరై ఆసక్తిగా పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా కోవెల ప్రసాద్ రెడ్డిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేకా సుబ్బరాయుడు, పి.వి. కృష్ణారెడ్డి, ఎన్. వెంకటసుబ్బయ్య, చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, చల్లా నరసింహారెడ్డి, రెడ్డి వరప్రసాద్, తుడిమెల్ల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### మర్రిమాకులపల్లి తండాలో రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు



**పీలేరు జూలై 20 ప్రభాతవార్త:** పీలేరు మండలం గూడరేవు పల్లి గ్రామం మర్రి మాకులపల్లి తండాలో రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికు వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రం స్వీకరించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం ఉదయం అధికారులు తండాకు వెళ్లి రోడ్డు మార్గాన్ని పరిశీలించి, అంచనాలు సిద్ధం చేశారు. ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి సూచనల మేరకు త్వరలోనే రోడ్డు పనులు చేపడతామని అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మర్రిమాకులపల్లి గ్రామ ఇన్చార్జ్ ప్రముఖ టిడిపి నేత అన్నా రెడ్డి, గ్రామస్తులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హార్టికల్చర్ హబ్ కు స్థల పరిశీలన చేసిన కలెక్టర్ నిశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి



**రామసముద్రం జూలై 20 ప్రభాతవార్త:** రామసముద్రం మండలం చొక్కాండ్ల పల్లెలో హార్టికల్చర్ హబ్ కు ఏర్పాటుకు కలెక్టర్ నిషాంత్ కుమార్, సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి సోమవారం స్థల పరిశీలన చేసారు. మదనపల్లె నియోజక వర్గంలో ఒక హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనువుగా రామసముద్రం మండలంలో హబ్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. . చొక్కాండ్ల పల్లె పంచాయతి కి చెందిన సర్వే నంబర్ 177 లో పశువుల మేతకు చెందిన 60 ఎకరాల భూమి ఉన్నట్లు తహశీల్దార్ మొహమ్మద్ అజారుద్దీన్ కలెక్టర్ కు తెలిపారు. ఇందుకు సంబంధించిన మ్యాప్ ను సబ్ కలెక్టర్ పరిశీలిచారు. అయితే 60 ఎకరాలను కొంత మంది రైతులు అనధికారికంగా సాగుచేస్తున్నారని తహశీల్దార్ కలెక్టర్ కు తెలిపారు. ఇందుకు సంబంధించి పలువురు రైతులు ఇక్కడ హబ్ ఏర్పాటు చేస్తే తాము భూములతో పాటు జీవనోపాధి కోల్పోతామని కలెక్టర్ కు విన్నవించుకున్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఇది హబ్ ఏర్పాటు కు ప్రతిపాదనలు మాత్రమే అని, ప్ర భుత్వం నుండి అనుమతులు మంజూరు అయితే మీ విషయంపై తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, తాహిసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్, మండల సర్వేయర్ నరేంద్ర రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## జిల్లా ఇంచార్జ్ మంత్రి జిల్లా కలెక్టర్‌ల చేతులు మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు



**రామసముద్రం జులై 20, ప్రభాతవార్త:** రామసముద్రం మండలం ఊలపాడు గ్రామ పంచాయతీ దిన్నిపల్లె సమీపంలోని ఆదర్శ పాఠశాల 202526 విద్యా సంవత్సరంలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలంలోనే అత్యధిక మార్కులు సాధించి ఏపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన షైనింగ్ స్టార్ కి ఆదర్శ పాఠశాల నుండి పి. వైష్ణవి, ఎం. యశస్విని ఎంపికయ్యారని, వీరిని జిల్లా హెడ్ క్వాటర్ నందు అన్నమయ్య జిల్లా ఇంచార్జి మంత్రి జిల్లా బిసి జనార్ధన రెడ్డి, కలెక్టర్ నిషాంత్ కుమార్ జిల్లా విద్యాధికారి కె. సుబ్రహ్మణ్యం చేతులు మీదుగా సోమవారం ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రం 20 వేలు రూ. బహుమతులుగా అందుకున్నారు, బహుమతులు పొందిన విద్యార్థులను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్, స్కూల్ చైర్మన్ బాలాజీ, కమిటీ మెంబెర్స్ టిడిపి మైనారిటీ నాయకులు వాహిద్ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## లారీ బోల్తా..తృటిలో తప్పిన ప్రమాదం



**గాలివీడు, జూలై 20: ప్రభాతవార్త :** మండలంలోని నూలివీడు గ్రామ సమీపంలో సోమవారం ఉదయం ఓ భారీ ట్రైలర్ లారీ అదుపు తప్పి రోడ్డుపక్కన బోల్తా పడింది. ప్రమాద సమయంలో లారీలో డ్రైవర్ మాత్రమే ఉండగా, స్వల్ప గాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు. లారీ బోల్తా పడటంతో కొంతసేపు ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. భారీ క్రేన్ సహాయంతో లారీని తొలగించే చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానికులు ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

## కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి

**మదనపల్లి క్రైమ్, జూలై 20 ప్రభాతవార్త.** కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని థిల్లానా సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు వెంకటేష్ కోరారు. సోమవారం థిల్లానా కార్యాలయంలో జరిగినది అల్టిమేట్ డాన్స్ అండ్ మ్యూజిక్ ఫెస్టివల్ పోస్టర్ల ను థిల్లానా సాంస్కృతిక సంస్థ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కళాకారులకు మన వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. మదనపల్లె, చుట్టూ పక్కల ప్రాంతాల డాన్స్ మాస్టర్స్, మ్యూజిక్ టీచర్స్, ఆర్ట్ టీచర్స్ అందరు ఏకమై కళలను ప్రోత్సహించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసి కళాకారుల ఐకమత్యాన్ని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 26న, మదనపల్లె ఆర్ ఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ నందు ఉదయం 9గంటలకు జరుగుతుందన్నారు. ఇందులో డాన్స్, మ్యూజిక్, ఆర్ట్, రీల్స్ వంటి విభాగాల్లో పోటీలు వుం టాయని, కళల పట్ల ఆసక్తి వున్న ప్రతి ఒక్కరు సద్వినియోగించుకోవాలన్నారు. పాల్గొన్న వారికీ బహుమతులతో పాటు సర్టిఫికెట్ అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అల్టిమేట్ నిర్వాహకులు డాన్స్ మాస్టర్ రాజశేఖర్, హర్ష, సందీప్, శ్రీకాం, వినయ్, థిల్లానా సభ్యులు దిలీప్, నాగ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజుల అగ్నిహోత్రం ద్వారా వర్షాలు కురిసేలా చేయచ్చు

## వర్షాలు కురవక పోతే అగ్నిహోత్రానికి అయ్యే ఖర్చు మేమే చెల్లిస్తాం , కృత్రిమ వర్షాల ప్రయోగంపై గజ్జెల రమణారెడ్డి సందేశం



సమావేశంలో మాట్లాడుతున్న పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు గజ్జల రమణారెడ్డి

**పులివెందుల, జూలై 20, ప్రభాత వార్త :** మూడు రోజుల పాటు అగ్నిహోత్రం నిర్వహించడం ద్వారా కృత్రిమ వర్షాల కురిపించవచ్చు అని పర్యావరణ పరిరక్షణ సమి తి సభ్యులు గజ్జల రమణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైయ స్సార్ ప్రెస్ క్లబ్ నందు నిర్వహించిన మీడియా సమావే శంలో ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి యజ్ఞాల ద్వారా కృత్రిమ వర్షాలు కురిపించ వచ్చు అని శాస్త్రాలు చెబుతు న్నాయి అని అన్నారు. అగ్ని హోత్రం నిర్వహించడం రాయల సీమకి శ్రీరామ రక్ష అని అన్నారు. ప్రపంచంలో ఇప్పటికీ రెండు దేశాలు యజ్ఞాలు చేస్తూ కృత్రిమ వర్షాలు కురిపించడం జరు గుతోంది అని అన్నారు. కృత్రిమ వర్షాలు కురిపించడంతో కరు వు ప్రాంతమైన రాయలసీమను సశ్యామలం చేయచ్చు అన్నారు. మన రాయలసీమ జిల్లాకు విస్తారంగా వర్షాలు రావాలి అంటే అనంతపురం జిల్లా సరిహద్దు ప్రాంతాలైన పెనుగొండ, హిందూ పూర్ ప్రాంతంలో అగ్ని హోత్రం చేయాలని అన్నారు. సెప్టెంబర్ నెలలో అయితే నెల్లూరు జిల్లాలో చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో కూడా చేయగలిగితే కూడా కృత్రిమ వర్షాలు కురిపించ డం జరుగుతుంది అన్నారు. వర్షాలు కురవకపోతే అందుకు అయ్యే ఖర్చు కూడా మేమే చెల్లిస్తామని అన్నారు. రాజకీయ నాయకులు ముందుకు వచ్చి అగ్ని హోత్రానికి ఖర్చు చేస్తే మేము చేసి కృత్రిమ వర్షాలు కురిపించాలా చేస్తామని అలా చేయలేకపో తే ఖర్చు అంతా వెనక్కి ఇస్తామన్నారు. అందుకు అయ్యే ఖర్చు అవసరమైన సామగ్రి, విధానం, సమయాల వివరాలను అం దులో పేర్కొన్నారు. ఆవు నెయ్యి, పచ్చ కర్పూరం, హోమ ద్రవ్యాలు, సమిధలు, ఆవు పాలు, గోమూత్రం తదితర పదార్థా లను ఉపయోగించాల్సి ఉంటుందని తెలిపారు. అగ్నిహోత్రాన్ని మూడు రోజుల పాటు వరుసగా ఉదయం 5 గంటల నుంచి 9 గంటలలోపు లేదా సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటలలోపు నిర్వహించాలని సూచించారు. గాయత్రీ మంత్రంతో కార్యక్రమాన్ని నిర్వహిం చాలని పేర్కొన్నారు. అదేవిధంగా నైరుతి రుతుపవనాలు, ఈశాన్య రుతుపవనాల కాలాల్లో ఈ ప్రయోగం నిర్వహిస్తే స్థానికంగా వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని సందేశంలో పేర్కొన్నారు. అయితే అగ్నిహోత్రం లేదా ఇలాంటి సంప్రదాయ పద్ధతుల ద్వారా వర్షపాతం నేరుగా కలుగుతుం దనే విషయాన్ని శాస్త్రీయంగా నిర్ధారించేందుకు వాతావరణ శాస్త్ర నిపుణుల పరిశీలన, ఆధారాలు అవసరమని నిపుణులు చెబుతున్నారు. హోమ ద్రవ్యాలు లభించే ప్రదేశంగా భరత్‌నగర్ బస్‌స్టాప్ ఎదురుగా ఉన్న గాయత్రి పరివార్‌ను పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు రమణారెడ్డి, రామలింగం, ఎల్లారెడ్డి తదితరులను సంప్రదించ వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# షైనింగ్ స్టార్స్‌కి గ్యారంపల్లి కళాశాల విద్యార్థులు ఎంపిక



కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు ప్రధానం

**పీలేరు, జూలై 20 ప్రభాతవార్త:** కేవీపల్లి మండలం, గ్యారంపల్లి ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాలలో 2024 26 విద్యా సంవత్సరంలో లీశిది చదివిన ఇద్దరు విద్యార్థులు శీ.మనోజ్ కుమార్ (988/1000) మరియు లీ .ఎకనాథ్ సాయి నాయక్ (979/1000) జిల్లాస్థాయి షైనింగ్ స్టార్స్ కి ఎంపికయ్యారని ఏపీఆర్జేసీ ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చెన్నకేశవులు తెలిపారు. షైనింగ్ స్టార్స్ విద్యార్థులకు సన్మాన కార్యక్రమం అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లి పట్టణంలోని విరిళి కళ్యాణమండపం నందు సోమవారం ఉదయం 11 గంటలకు జరిగినది. విద్యార్థులను ఎమ్మెల్యే షాజహాన్ భాష, జిల్లా ఇన్చార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కలెక్టర్ నిశాంత్ కుమార్ ఘనంగా సన్మానించారు. ప్రతి షైనింగ్ స్టార్ కి ఒక మెడల్, మెరిట్ సర్టిఫికెట్, 20000 రూపాయల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం విద్యార్థులపై మరింత బాధ్యత పెంచిందని, క్రమశిక్షణతో మంచి స్థాయికి ఎదగాలని కోరారు. అదేవిధంగా ఎమ్మెల్యే షాజహాన్ భాష , అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ చక్కటి క్రమశిక్షణతో చదివి విద్యార్థులు ఎన్నో ప్రతిభా అవార్డులు సాధించి అటు తల్లిదండ్రులను ఇటు గురువులను గౌరవిస్తూ సమాజానికి సేవ చేయాలని కోరారు. సన్మాన కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

# జేసీసీ సమావేశం వెంటనే ఏర్పాటు చేసి 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

## ఆపస్ డిమాండ్



**మదనపల్లెక్రైం, జూలై 20 ప్రభాతవార్త.** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక సమస్యలపై వెంటనే మంత్రివర్గ ఉపసంఘంతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్ ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాలాజీ డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లెలో ఆపస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాలాజీ, రాష్ట్ర సహాధ్యక్షుడు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బి. దివాకర్, రాష్ట్ర మీడియా కన్వీనర్ రెడ్డి రాజేశ్వరి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేదీలోపు ఉద్యోగ సంఘాలతో జేసీసీ సమావేశం నిర్వహిస్తామని మంత్రులు పార్థసారథి, సత్యప్రసాద్ గతంలో ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి 12వ పీఆర్సీ ప్రక్రియను ప్రారంభించాలని, పెండింగ్ డీఏలు, 2022 నుంచి రావాల్సిన సరెండర్ లీవ్ బకాయిలు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. జేసీసీ సమావేశం ఏర్పాటు చేయకపోతే ఇతర సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ.. ఫౌండేషన్ స్కూళ్లను తిరిగి బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చాలని, ఇన్‌సర్వీస్ టీచర్లకు నిర్వహించే ప్రత్యేక టెట్‌లో అన్ని వర్గాలకు 60 మార్కులను (40!!) అర్హతగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాల లోకల్ క్యాడర్ ప్రక్రియలో భాగంగా ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుకు సబ్ కమిటీని ఏర్పాటు చేయాల న్నారు. రాష్ట్ర సహాధ్యక్షుడు రామాంజనేయ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు నరసిం హులు, పచ్చర్ల సుధాకర్, కోశాధికారి శివ శంకర్, నాయకులు వెంకటరమణ, సిద్ధా రెడ్డి, కళ్యాణ్ చక్రవర్తి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డు అందుకోవడం పాఠశాలకు గర్వకారణం

### పాఠశాల ప్రధానోపాధ్యాయుడు.జి సమీపుల్లా



**రామాపురం జూలై 20 ప్రభాతవార్త :** అన్నమయ్య జిల్లా, రామాపురం మండలంలోని జెడ్పీహెచ్ఎస్ (ఉర్దూ), నీలకంఠరావుపేట పాఠశాలకు చెందిన ప్రతిభావంతురాలైన విద్యార్థిని సయ్యద్ సబీహా ప్రతిష్ఠాత్మకమైన "షైనింగ్ స్టార్ అవార్డు" అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా అందుకోవడం పాఠశాలకు ఎంతో గర్వకారణంగా నిలిచిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షమీ ఉల్లా అన్నారు. అత్యుత్తమ విద్యా ప్రతిభ కనబరిచినందుకు అన్నమయ్య జిల్లా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా సయ్యద్ సబీహాకు షైనింగ్ స్టార్ అవార్డు, ప్రశంసా పత్రం, అలాగే రూ.20,000 నగదు బహుమతి అంద అందజేయడం జరిగిందన్నారు ఈ ఘనత ఆమె నిరంతర కృషి, పట్టుదల, క్రమశిక్షణకు నిదర్శనం మాత్రమే కాకుండా, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల ప్రోత్సాహం, మార్గదర్శకత్వానికి కూడా ప్రతీకగా నిలిచిందనీ అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. సమీవుల్లా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘౌస్‌పీర్, వాణి, కరీముల్లా, సునీర్, మజ్హరుల్ హక్, మహబూబ్ బాషా మరియు తల్లిదండ్రులు సయ్యద్ సబీహాను హృదయపూర్వకంగా అభినందించారు.

## టిడిపి ఇన్చార్జిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



**బద్వేలు, జూలై20, ప్రభాతవార్త** బద్వేలు టిడిపి ఇన్చార్జి సూర్య నారాయణ రెడ్డిని సోమవారం మాజీ ఎమ్మెల్యే జయ రాములు కలిశారు. జయ రాములు ప్రస్తుతం బిజెపిలో కొనసాగుతున్నందున కూటమి ప్రభుత్వ హయాంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో చేపట్టాల్సిన వ్యూహాల గురించి సూర్యనారాయణ రెడ్డి తో ఆయన చర్చించడం జరిగింది. అలాగే పట్టణంలో కూటమి బలోపేతానికి మరింత కృషి చేయడంతో పాటు పార్టీ పటిష్టతకు సంయుక్తంగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం నూతన టిడిపి ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణ రెడ్డిని జయరాములు ఘనంగా సత్కరించారు.

## లక్కీరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా అడ్వకేట్ వీరభద్రయ్య నియామకం



**లక్కీరెడ్డిపల్లి జూలై 20 ప్రభాత వార్త** లక్కీరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా అడ్వకేట్ వీరభద్రయ్యను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని అడ్వకేట్ సిద్దయ్య తెలిపారు ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు గోవారవనీయులు మంత్రి మండి పల్లి రామ్ ప్రసాద్ రెడ్డి గారి చొరవతో నూతన ఎజిపి ప్రభుత్వం తరఫున సివిల్ కేసులను వాదించే బాధ్యతను అప్పగించారు. ఆమె బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి మూడేళ్ల పాటు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయి. అసిస్టెంట్ గవర్నమెంట్ ఫీడర్ గా పుష్పలతకు నెలకు రూ. 10 వేలు గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఈ కార్యక్రమములో అడ్వొకేట్ సిద్దయ్య పక్కీరయ్య ముక్తియార్ అహమ్మద్ మహబూబ్ భాషా నియామకంపై పలువురు ఆయనకు దుశలవతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం

## ఎమ్మెల్యే షాజహాన్ భాషా



**మదనపల్లెక్రైం, జూలై 20 ప్రభాతవార్త.** ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే షాజహాన్ భాష అన్నారు. సోమవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నందు పద్మావతి ఏజెన్సీ శానిటేషన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఈఎస్ఐ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మదనపల్లె శాసనసభ్యులు షాజహాన్ భాషా ముఖ్య అతిథిగా హాజరై, 54 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఈఎస్ఐ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈఎస్ఐ కార్డుల ద్వారా కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన ఉచిత వైద్య సదుపాయాలు అందుతాయని తెలిపారు. ప్రతి కార్మికుడు ఈ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ ఆసుపత్రి శానిటేషన్ విభాగాధికారులు, సిబ్బంది, పద్మావతి ఏజెన్సీ ప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్‌ను కమతంపల్లిలో కొనసాగించాలి



**కురబలకోట జూలై 20 ప్రభాతవార్త :** నాలుగు గ్రామాల ప్రజలందరికీ సౌకర్యంగా ఉన్న అంగన్వాడి సెంటర్‌ను కమతంపల్లిలోని కొనసాగించేలా కృషి చేస్తానని రాజంపేట పార్లమెంటరీ కాపునాడు అధ్యక్షుడు, మండల టిడిపి యువ నాయకులు శెట్టి సీతారాంబాబు భరోసా ఇచ్చారు. సోమవారం అంగన్వాడి సెంటర్ పనితీరును ఆయన పరిశీలించారు. అక్కడ మహిళలు, బాలింతలు ,గర్భిణీలు, పిల్లల తల్లి దండ్రులు ఎంతో సౌకర్యంగా ఉన్న సెంటర్ను ఇక్కడి నుంచి తరలించాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తమకు తెలిసిందని మహిళలు ఆయన దృష్టికి తెచ్చారు. సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి నాలుగు గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ సెంటర్ ను ఇక్కడే కొనసాగించాలా కృషి చేస్తానని తెలిపారు.

## ఉపాధి పనుల పై అంబుడ్స్ మెన్ అధికారి ప్రశంస



**తంబళ్లపల్లె జూలై 20 ప్రభాతవార్త ః** తంబళ్లపల్లె మండలంలో జరుగుతున్న విబిజి రాంజీ పథ కంలో జరుగుతున్న జలధార జల హారతి ఉపాధి హామీ పనుల నిర్వహణపై అంబుడ్స్ మెన్ అధికారి శ్రీరాములు ప్రశంసించారు. సోమవారం ఆయన మండలంలోని జుంజురపెంట పంచాయతీ లోని ఉపాధి హామీ పనులను పరిశీలించారు. మండలంలోని పంచాయతీలలో సైతం ఇదే స్ఫూ ర్తితో జలధార, జలహారతి కార్యక్రమాల నిర్వహణ తో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి జల సంరక్షణ పనులు ముమ్మరం చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపిఓ అంజనప్ప, ఈసీ మహేష్, టెక్నికల్ అసిస్టెంట్లు బాలగంగాధర్, సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి : హరి రాయల్



**చౌడేపల్లి జూలై 20 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని సింగల్ విండో చైర్మన్ హరి రాయల్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక ఆర్ఎస్కె వద్ద వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న నాణ్యమైన వేరుశనగ విత్తనాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలతో పాటు ఎరువులను కూడా అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు ఖరీఫ్ సాగును చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి మోహన్ కుమార్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్‌బీకే సిబ్బంది పరిసర ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

## ప్రతిభ అవార్డును అందుకున్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థిని



**పీలేరు , జూలై 20 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని పీలేరు పట్టణంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల నందు సిఈసి గ్రూపు నందు 967మార్కులు సాధించిన విద్యార్థిని జోయ తస్లీమ్‌కు సోమవారం మదనపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష ,జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపల్ నాగార్జున రెడ్డి, విద్యార్థిని ఈ యొక్క ప్రతిభ అవార్డు (షైనింగ్ స్టార్స్)ను అందుకోవడం జరిగింది. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రత్యేకంగా శ్రీ చైతన్య కళాశాల సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జున రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కళాశాల నందు క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడం జరుగుతున్నదని అన్నారు. అదేవిధంగా కళాశాలలో ప్రతి సంవత్సరం విద్యార్థులు అధిక మార్కులు సాధించి పోటీ పరీక్షల్లో రాణించటం జరుగుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా శ్రీ చైతన్య జూనియర్ కళాశాల అధ్యాపక బృందాన్ని, విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ ఆర్ సుధా నంద రెడ్డి, ప్రిన్సిపల్ నాగార్జున రెడ్డి, డైరెక్టర్లు జనార్దన్ రెడ్డి, చంద్రశేఖర్, లోకేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ నాయుడు లను జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

## సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్ల పంపిణీ



**బద్వేలు అర్బన్, జూలై 20, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బద్వేలు సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం నెం.2 లో విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు, తువ్వాళ్లు, నైట్‌వేర్, వులెన్ బెడ్‌షీట్లు తదితర సామాగ్రిని సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బద్వేలు ఆర్‌డీఓ ఎ.చంద్రమోహన్ ముఖ్య అతిథిగా హాజరై సామాగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా గత విద్యా సంవత్సరంలో ఈ హాస్టల్‌లో చదివి 582 మార్కులు సాధించిన విద్యార్థి షేక్ బషీర్ అహ్మద్‌కు గట్టుపల్లి చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గీతాల పెంచలరెడ్డి, గట్టుపల్లి కొండారెడ్డి రూ.5000 పారితోషికం అందజేశారు. ఇదే ఫౌండేషన్ గత ఏడాది బద్వేలు పరిధిలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లోని పదవ తరగతి విద్యార్థులందరికీ ఎగ్జామ్ కిట్లు అందించింది. రాబోయే రోజుల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులందరికీ ప్రైజ్ మనీ అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ డబ్ల్యూ ఓ హైఫా, స్థానిక వసతిగృహాల వార్డెన్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జీవో 396 రద్దు చేయాలంటూ దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

### ఈనెల 20 నుంచి 31 వరకు నిరవధిక ఆందోళన కక్షిదారులు సహకరించాలని సంఘం విజ్ఞప్తి



**కలికిరి, జులై 20, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.396ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి నిరవధిక పెన్‌డౌన్ కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఉరవకొండ సబ్ డివిజన్ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం కూడా జులై 20 నుంచి 31 వరకు ఆందోళనలో పాల్గొంటున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలతో పాటు కక్షిదారుల సొంత వ్యవహారమైన దస్తావేజుల తయారీ విధానాన్ని కూడా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగిస్తూ జారీ చేసిన జీవో నెం.396 దస్తావేజు లేఖరుల జీవనోపాధికి తీవ్ర విఘాతం కలిగిస్తుందని సంఘం పేర్కొంది. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జులై 20 నుంచి 31 వరకు జరిగే నిరవధిక పెన్‌డౌన్ కార్యక్రమంలో రాష్ట్రంలోని దస్తావేజు లేఖరులందరూ పాల్గొంటున్నారని, ఈ కారణంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దస్తావేజుల తయారీ సేవలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఆందోళనకు కక్షిదారులు సహకరించి తమకు కలిగే ఇబ్బందులను అర్థం చేసుకోవాలని కలికిరి సబ్ డివిజన్ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి జీవో 396పై పునరాలోచన చేసి దానిని ఉపసంహరించుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండార్లు టీడీపీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## విద్యార్థుల గొంతు నొక్కడం ప్రజాస్వామ్యంపై దాడి



**పీలేరు జూలై 20 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా విద్యార్థులు తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేపడుతుంటే, వారిపై బీజేపీ ప్రభుత్వం అమానుషంగా లాఠీచార్జీలు చేయించడం, 7 అడుగుల ఎత్తైన బ్యారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకోవడం, మెట్రో స్టేషన్లను మూసివేసి విద్యార్థులను నిర్బంధించడం, వేలాది మంది పోలీసులను మోహరించి భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య విలువలపై బహిరంగ దాడి అని సీపీఐ నాయకులు తీవ్రంగా ఖండించారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో సీపీఐ నాయకులు విలేకరులతో మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌టీఏలో వరుసగా బయటపడుతున్న అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకులు, అవినీతి ఆరోపణలతో దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మకం కోల్పోయారని పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పలువురు యువ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం స్పందించకుండా, బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడేందుకు ప్రయత్నించడం అత్యంత బాధ్యతారాహిత్యమని విమర్శించారు. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులను అణచివేయడం మానుకుని, వారి సమస్యలకు పరిష్కారం చూపడమే ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశంలో కవిత పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి



చౌడేపల్లి జూలై 20 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని సింగల్ విండో చైర్మన్ హరి రాయల్ అన్నారు. సోమవారం ఆయన స్థానికం ఆర్ఎస్కె వద్ద వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న నాణ్యమైన వేరుశనగ విత్తనాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలతో పాటు ఎరువులను కూడా అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఎల్ ని నో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు ఖరీఫ్ సాగును చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి మోహన్ కుమార్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్‌బీకే సిబ్బంది పరిసర ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యా సామాగ్రిని విద్యార్థులకు పంపిణీ చేస్తున్న దృశ్యం

పీలేరు జూలై 20 ప్రభాతవార్త:

శివరాంపురం ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ సిద్ధప్ప ఆధ్వర్యంలో అమెరికాలో ఉన్న శ్రీమతి సుమలత మేడం వారి మిత్రబృందంచే ఏర్పాటు చేసిన ABC సేవా సంస్థ ద్వారా పీలేరు మండలం శివరాంపురం ప్రాథమిక పాఠశాల నందు పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ నోట్ బుక్స్, స్లేట్స్, స్లేట్ పెన్సిల్స్ ,బ్లూ అండ్ రెడ్ ఇంక్ పెన్స్, ఎరైజర్స్, షాప్ నర్స్, బిస్కెట్స్ లను సుమలత మేడం తండ్రిగారైన శ్రీ రాజేంద్ర ఆచారి శివరాంపురం హైస్కూల్ టీచర్స్, ఫిజిక్స్ టీచర్ దేవాంజలు, హిందీ టీచర్ వెంకటరమణ నాయక్ శెట్టిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్. డబ్ల్యు. హెడ్మాస్టర్ రాచపల్లి కృష్ణమూర్తి మెటీరియల్స్‌ను పంపిణీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ జి. సిద్ధప్ప విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బిసిలకు రాష్ట్ర స్థాయిలో పదవులు వచ్చేలా చేసిన ఏకైక నాయకుడు మంత్రి మండిపల్లి: గండికోట సుధాకర్

రాయచోటి జులై 20 ప్రభాతవార్త



బిసిలకు రాష్ట్ర స్థాయిలో పదవులు వచ్చేలా చేసిన ఏకైక నాయకుడు మంత్రి మండిపల్లి అని రాయచోటి మండల తెలుగుదేశం పార్టీ రూరల్ అధ్యక్షులు గండికోట సుధాకర్ పేర్కొన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవలే వైసీపీని వీడి టిడిపిలో చేరిన మాజీ ఎంపిపి అంబాబత్తిన రెడ్డయ్య తన సొంత డబ్బులతో రాజకీయం చేస్తూ ఏళ్ల తరబడి పార్టీలో ఉన్నప్పటికీ ఎటువంటి న్యాయం చేయకపోగా అతనిపై విమర్శలు చేయడం తగదన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిషలు కృషి చేసే నేత మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అని ఆయనను కొనియాడారు. బిసిలను ఓటు బ్యాంక్ గా మాత్రమే చూడకుండా సామజిక న్యాయంతో వారికీ పదవులు కేటాయించిన ఘనత మంత్రి మండిపల్లిది అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ నాగార్జున రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉదయగిరి మస్తాన్,మాజీ సర్పంచ్ బసయ్య తదితరులు పాల్గొన్నారు.

# 24న ఉద్యోగాల కోసం జాబ్‌మేళా

మదనపల్లె, జులై 20 ప్రభాతవార్త :

నిరుద్యోగులకు ఉద్యోగాల కోసం ఈనెల 24న టాటా ఏఐఏలైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగాల కోసం జాబ్ మేళా పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద సుందర్‌రాజ్ పెట్రోల్‌బంకుకు ఎదురుగా ఉన్న కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన నిరుద్యోగల యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాలో టీమ్‌లీడర్, మార్కెటింగ్ అడ్వైయిజరీ, టెలికాలర్ పోస్టులకు నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన 20నుంచి 60సంవత్సరాల లోపు వయస్సుగల వారు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపికైన వారికి రూ.30వేల వరకు వేతనం ఉంటుందన్నారు. వివరాలకు 9751126855, 6301612761 ఫోన్‌నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# నీటి ఎద్దడి తీర్చాలంటూ కలెక్టరేట్ వద్ద నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మదనపల్లె, జులై 20 ప్రభాతవార్త :

నీటి ఎద్దడి తీర్చాలంటూ పెద్ద ఎత్తున మహిళలు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంతో పాటు ఎర్రగానిమిట్ట వద్ద ఉన్న టిట్కో ఇండ్ల కాలనీలో నీటిసమస్య తీవ్రంగా ఉందంటూ మహిళలు కలెక్టరేట్‌కు తరలి వచ్చారు. నీటి ఎద్దడి తీర్చాలంటూ నినాదాలు చేస్తూ నిరసనలు వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో జరుగుతున్న పిజిఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మకు నీటి ఎద్దడిపై వినతిపత్రం అందజేశారు. అనంతరం మహిళలు మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి నీటిసమస్యపై నిరసనలు వ్యక్తం చేశారు. గత 15రోజులుగా నీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని ఆర్ఓ పల్లవికి నీటి ఎద్దడిపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళల తరపున వైకాపా నాయకులు ముజీబ్‌హుస్సేన్ మాట్లాడుతూ నిరుపేదలు నివసించే టిట్కో ఇండ్ల వద్ద నీటిసమస్య అధికంగా ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి నీటిసమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# జీఓనెంబర్ 396ను రద్దు చేయాలి

## దస్తావేజుల లేఖరులు నిరసనలు



నిరసనలు వ్యక్తం చేస్తున్న దృశ్యం

మదనపల్లె, జులై 20 ప్రభాతవార్త :

జిఓనెంబర్ 396ను రద్దు చేసి దస్తావేజుల లేఖరులకు న్యాయం చేయాలంటూ సబ్‌రిజిష్టర్ కార్యాలయం వద్ద నిరసనలు వ్యక్తం చేశారు. సోమవారం సబ్‌రిజిష్టర్ కార్యాలయం వద్ద దస్తావేజులు లేఖరులు, సహాయకులు, డిటిపి ఆపరేటర్లు, స్టాంప్‌వెండర్లు, రాష్ట్ర సంఘం పిలుపు మేరకు 20నుండి 31వరకు పెన్‌డౌన్ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా దస్తావేజుల లేఖరులు మాట్లాడుతూ దస్తావేజులు తయారీ విధానాన్ని రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగించే జీఓనెంబర్ 396నుంచి వెంటనే ఉపసంహరించుకొని, తమ జీవనోపాధిని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సబ్‌రిజిష్టర్ గురుస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజుల లేఖరుల రాష్ట జాయింట్ కార్యదర్శి ఖంగేరి నందా, అధ్యక్షులు రంగు గుణశేఖర్, గౌరవ అధ్యక్షులు రంగు రాజేంద్ర, ఉప కార్యదర్శి జి.రెడ్డప్ప, కోశాధికారి మహమ్మద్ లవానిబాబు, నాయకులు సాయిశేఖర్‌రెడ్డి, రెడ్డిశివరామ్, రవి, హాజీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఐబిఎంపై శిక్షణా కార్యక్రమం

మదనపల్లె, జులై 20 ప్రభాతవార్త :



అభినందిస్తున్న దృశ్యం

పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఐబిఎం స్కిల్స్ బిల్డ్ శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. కళాశాలకు చెందిన హార్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం ఎడ్యునెట్ ఫౌండేషన్ సహకారంతో మూడు రోజులు పాటు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు కరస్పాండెట్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యక్షులు నాగమల్లారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఫౌండేషన్ మేనేజర్ అశ్వనీకుమార్ రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. శిక్షణా కార్యక్రమం విద్యార్థులకు ఆచరాణాత్మక జ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన సర్టిఫేషినల్‌ను అందించి తద్వారా వారి ఉపాధి అవకాశాలను బలపేతం చేసి, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో విజయవంతమైన వృత్తి జీవితానికి వారిని సిద్దం చేస్తుందని తెలిపారు. డేటా సైన్ విభాగాదిపతి ప్రొపెసర్ డాక్టర్ ఆర్.మహమ్మద్‌షపి మూడు రోజులు పాటు జరిగే శిక్షణా కార్యక్రమంలో విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి పలు విషయాలను తెలియజేయనున్నట్లు తెలిపారు.

# జీవో 396 రద్దు చేయాలని డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్



నిరసన చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

పులివెందుల, జూలై 20, ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపె ట్టిన జీవో నంబర్ 396ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యా ప్తంగా చేపట్టిన పెన్‌డౌన్ ఉద్యమంలో భాగంగా సోమవారం పులివెందు లలో డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చేపట్టారు. పులివెందుల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ, జీవో నంబర్ 396ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకుని తమ జీవనోపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పెన్‌డౌన్ సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే పీపీపీ విధానం అమలులోకి వస్తే ప్రజల ఆస్తుల పరిరక్షణపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని, ఆస్తులు అన్యాక్రాంతమయ్యే అవకాశాలు ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో దస్తావేజు లేఖరి సంఘం అధ్యక్షుడు వి. బసవరాజు, సీనియర్ డాక్యుమెంట్ రైటర్ డీసీబీ ప్రసాద్, డాక్యుమెంట్ రైటర్లు వల్లి, శివ తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో వర్షాలు కురవాలని వరుణ హోమం

మైదుకూరు, జూలై 20, ప్రభాతవార్త:

పట్టణంలోని శ్రీ మాధవరాయ భీమలింగేశ్వర-ఆంజనేయస్వామి దేవాలయంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సోమవారం వరుణ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షతో పవిత్ర జలాలను కదువ, కలశాల్లో తీసుకువచ్చి ఆలయ ప్రాంగణం చుట్టూ భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేశారు. అనంతరం గణపతి పూజ, వరుణ యంత్రానికి అష్టోత్తర కలశ పూజలు నిర్వహించి, వేద మంత్రోచ్ఛారణల మధ్య వరుణ హోమాన్ని నిర్వహించారు. మహిళలు తీసుకువచ్చిన పవిత్ర జలాలతో భీమలింగేశ్వర స్వామి లింగానికి విశేష జలాభిషేకం, పంచామృత అభిషేకం చేయగా, ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ బెల్లం సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, కుటుంబ సభ్యుల సహకారంతో విజయవంతంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



# భరత నాట్యము, జానపద నృత్యాలలో పిల్లలకు తర్ఫీదు..

కడప కార్పొరేషన్ జూలై 20 ప్రభాతవార్త:

కడప శిల్పారామంలో 6 నుంచి 16 సంత్సరాల వయసు ఉన్న వారికి ఎటువంటి ఫీజు లేకుండా భరత నాట్యము, జానపద నృత్యాలలో తర్ఫీదు ఇస్తామని కడప శిల్పారామం ఆఫీస్ యందు పరిపాలన అధికారి పి శివప్రసాద్ రెడ్డి తెలిపారు. అలాగే తరిఫీది ఇవ్వడానికి డాన్స్ మాస్టర్లు కావాలన్నారు. తర్ఫీదు ఇచ్చే మాస్టర్లకు గౌరవ భృతి ఇస్తామని తెలిపారు. పిల్లలకు డాన్స్ నేర్పించుటకు ఈ అవకాశాన్ని సద్వినిగం చేసుకోవాలని కడప నగరంలోని తల్లిదండ్రులను కోరారు. శిక్షణ కొరకు నెంబర్లు 8886652058, 8886652038, 8886652003 లను సంప్రదించాలన్నారు.



# పాత ఆసుపత్రి భవనంపై చర్యలు తీసుకోండి

సిద్దవటం జులై 20 ప్రభాతవార్త



సిద్దవటంలోని పాత ఆసుపత్రి భవనం ఎవరి ఆదీనంలో ఉందో తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయ అధికారిణి డాక్టర్ హిమావతి హామీ ఇచ్చినట్లు సిద్దవటం జేఏసీ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గతంలో పాత ఆసుపత్రి భవనాన్ని బస్టాండుకు కేటాయించాలని గ్రీవెన్స్ సెల్ నందు జిల్లా కలెక్టర్ కు ఇచ్చిన గ్రీవెన్స్ స్థితిని తెలుసుకునేందుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయ అధికారిణి డాక్టర్ హిమావతి ని కలవడం జరిగిందన్నారు. సిద్దవటంలోని పాత ఆసుపత్రి భవనం ఎవరి ఆదీనంలో ఉందో తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారన్నారు. ఆమెను కలిసిన వారిలో సిద్దవటం జేఏసీ ప్రెసిడెంట్ బండారు రాజగోపాలయ్య, ప్రధాన కార్యదర్శి పాలెం నారాయణ, కోశాదికారి గాలి ఓబయ్య, వైస్ ప్రెసిడెంట్ కే భాస్కర్ రెడ్డి సెక్రటరీ సిద్దయ్య, కొట్టే రాజేష్ లు ఉన్నారు.

# జీవో నెంబర్ 396ను రద్దు చేయాలని

## రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద నిరసన



ప్రొద్దుటూరు అర్బన్, జూలై 20, ప్రభాతవార్త :

రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణ, సేవా కేంద్రాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జమాలుద్దీన్ మాట్లాడుతూ జీఓ ఎంఎస్ నెం.396ను రద్దు చేసి, దస్తావేజు లేఖరుల లైసెన్సులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొత్త విధానాలతో లేఖరులు, స్టాంపు వెండర్లు, డీటీపీ ఆపరేటర్ల జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొండారెడ్డి, అలీ బాషా, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపిపై పొంతనలేని విమర్శలు చేస్తున్న రాచమల్లు

## టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వైఎస్ జబీవుల్లా

ప్రొద్దుటూరు జూలై 20 ప్రభాతవార్త



టిడిపిపై మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి పొంతన లేని విమర్శలు చేస్తున్నారని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వైఎస్ జబీవుల్లా పేర్కొన్నారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తెలుగుదేశం పార్టీ నాయకులపై రాచమల్లు చేసిన విమర్శలను ఆయన కొట్టి పారేశారు. గతంలో మాట్లాడిన మాటలకు ప్రస్తుతం చేస్తున్న వ్యాఖ్యలకు ఎలాంటి పొంతన లేదన్నారు. ఒకవైపు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సమర్థిస్తూ మాట్లాడుతున్న రాచమల్లు, గతంలో సీబీఐ, సుప్రీం కోర్టు వంటి సంస్థలను అత్యున్నతమైనవిగా కొనియాడారని గుర్తు చేశారు. గతంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని గొప్ప నాయకుడిగా అభివర్ణించిన రాచమల్లు, ఇప్పుడు పూర్తిగా భిన్నంగా మాట్లాడటం ఆయన రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ప్రజల తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని, నిరాధార విమర్శలకు స్వస్తి పలకాలని ఆయన సూచించారు.

# ఎమ్మెల్యే మండలాలలో పర్యటన

మైదుకూరు, జులై 20, ప్రభాతవార్త:

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ 21 (మంగళవారం) ఉదయం 10:00 గంటలకు బ్రహ్మంగారిమఠంలోని బ్రహ్మం సాగర్ ప్రాజెక్టు నుంచి లెఫ్ట్ కెనాల్‌కు సాగునీటిని విడుదల,సాయంత్రం 4:00 గంటలకు మైదుకూరు మండలం లెక్కలవారిపల్లె సమీపంలోని ఎస్ఆర్2 (శీశి2) నుంచి మైదుకూరు చెరువులకు నీటిని విడుదల చేసే కార్యక్రమాల్లో సంబంధిత మండల టీడీపీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, ప్రతినిధులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ప్రకటనలో తెలిపారు.

# శ్రీ ఈశ్వరదేవిమఠంలో భూముల వేలం పాటలు

బ్రహ్మంగారిమఠం జూలై 20 ప్రభాతవార్త

మహా శక్తి స్వరూపిణి జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో వివిధ గ్రామాల్లోని శ్రీ ఈశ్వరీ దేవి మఠానికి చెందిన వ్యవసాయ భూములను కౌలు పద్ధతిలో కేటాయించేందుకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు శ్రీ ఈశ్వరి మఠం కార్య నిర్వహణ అధికారి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ వేలం పాట రేపు 22 (బుధవారం) ఉదయం 10.00 గంటలకు శ్రీ ఈశ్వరదేవి మఠం ప్రాంగణంలో నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. మొత్తం 11 వ్యవసాయ భూములు కౌలుకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. వేలంలో పాల్గొనదలచిన రైతులు, ఆసక్తిగల వ్యక్తులు నిర్ణీత సమయానికి అవసరమైన ధ్రువపత్రాలతో హాజరై వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలం నిబంధనలు, భూముల సర్వే నంబర్లు, విస్తీర్ణం తదితర వివరాల కోసం శ్రీ ఈశ్వరిదేవి మఠం కార్యాలయాన్ని సంప్రదించాలని మఠం అధికారులు కోరారు.

# పైడిపాలెం రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు

## పరిశీలించిన హెచ్ ఎల్సి చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి

పులివెందుల, జూలై 20 , ప్రభాతవార్త :

నియోజక వర్గంలోనీ సింహాద్రిపురం మండలం పైడిపాలెం రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు చేరుతున్న నేపథ్యంలో తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కడప జిల్లా జలవనరుల శాఖ అధికారులతో కలిసి రిజర్వాయర్‌కు చేరుతున్న నీటి ప్రవాహం, లిఫ్ట్ వ్యవస్థ పనితీరు, నీటి సరఫరా పరిస్థితులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ పైడిపాలెం రిజర్వాయర్‌కు కృష్ణా జలాల చేరికను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నీటి సరఫరా ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సాగునీరు సకాలంలో అందేలా నీటి నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. లిఫ్ట్ వ్యవస్థ ద్వారా నీటి సరఫరా సజావుగా కొనసాగుతోందని జలవనరుల శాఖ అధికారులు వివరించారు. రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీటి పరిమాణాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన సాంకేతిక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ పరిశీలనలో కడప జిల్లా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ బాలచంద్రారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రమేష్, డిప్యూటీ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్లు, సంబంధిత అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పైడిపాలెం రిజర్వాయర్ కి వస్తున్న నీటిని పరిశీలిస్తున్న దృశ్యం

# శారదా కళాశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి గుర్తింపు



ప్రొద్దుటూరు అర్బన్, జూలై 20 ప్రభాతవార్త

స్థానిక గీతాశ్రమం వీధిలోని శారదా జూనియర్ కళాశాలకు చెందిన ఓ. ఆయేషా (హెచ్ఈసీ), కె. గీతిక (ఎంఈసీ) రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన షైనింగ్ స్టార్-2026షి కార్యక్రమంలో ఎంపికై రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందారు. సోమవారం కడపలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఐఏఎస్ చేతుల మీదుగా ఇద్దరు విద్యార్థులకు మెడల్, ప్రశంసాపత్రంతో పాటు రూ.20 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం తరఫున ఎం. సురేష్ బాబు, ఎం. దుర్గాభవాని, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# నేడే బ్రహ్మంసాగర్ లెఫ్ట్ కెనాల్‌కు నీటి విడుదల

బ్రహ్మంగారిమఠం జూలై 20 ప్రభాతవార్త

బ్రహ్మంగారిమఠంలోని బ్రహ్మం సాగర్ ప్రాజెక్టు నుంచి లెఫ్ట్ కెనాల్‌కు మంగళవారం ఉదయం 10 గంటలకు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సాగునీటిని విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు, పాత్రికేయులు పాల్గొననున్నట్లు బ్రహ్మంగారిమఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# దస్తావేజు లేఖరులు నిరవధిక పెన్ డౌన్



వేంపల్లె జూలై 20 ప్రభాతవార్త

స్థానిక సబ్ రిజిస్ట్రేషన్ పరిధిలోని దస్తావేజు లేఖరులు నిరవధిక పెన్ డౌన్ సమ్మె చేపట్టారు. ఇటివల ప్రభుత్వం తెచ్చిన జీఓ 396ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 20 నుంచి 31 వరకు నిరవధిక పెన్ డౌన్ సమ్మె ప్రకటించారు. రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ ప్రైవేటీకరణను ఆపాలని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు ఉప సంహరణ, ప్రజల ఆస్తులకు బధ్రత కల్పించాలని కోరారు. అలాగే దస్తావేజు లేఖరుల లైసెన్స్ లను పునరుద్దరించి లేఖరులు, స్టాంప్ వెండర్లు, డిటిపి ఆపరేటర్ల జీవనోపాధిని కాపాడాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. ప్రభుత్వం తెచ్చిన పిపిపి విధానం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిటిపి ఆపరేటర్లు తదితరులు రోడ్డున పడే దుస్థితి ఉందని వాపోయారు. ఈ కార్యక్రమంలో నేతి శంకర్, రెడ్డయ్య, మనోహర్ రెడ్డి, నరసింహ, పవన్ కుమార్, నాగేంద్ర, షాబుద్దీన్ తదితర వెండర్లు, డిటిపి ఆపరేటర్లు పాల్గొన్నారు.

# మృతిచెందిన ఎస్సీ యువకుల కుటుంబాలకు ఆర్థిక సాయం



బ్రహ్మంగారిమఠం జూలై 20 ప్రభాతవార్త

మండ్నలలో ఇటీవల తెలుగు గంగ కాలువలో పడి మృతిచెందిన ఇద్దరు ఎస్సీ యువకుల కుటుంబాలను బ్రహ్మంగారిమఠం తహసీల్దార్ కార్తీక్ సోమవారం పరామర్శించారు. ముదుమాల గ్రామానికి చెందిన కొడూరు సతీష్ కుటుంబాన్ని, గుండాపురం గ్రామానికి చెందిన పండేటి ఓబులేష్ కుటుంబాన్ని వారి నివాసాలకు వెళ్లి కలిసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక దాతల సహకారంతో సమీకరించిన నిధుల ద్వారా ప్రతి కుటుంబానికి 10,000 వేలు నగదు, నిత్యావసర సరుకులను కూడా పంపిణీ చేశారు.బాధిత కుటుంబాలు తీవ్ర విషాదంలో ఉన్న నేపథ్యంలో వారికి మానసిక ధైర్యం చెప్పిన తహసీల్దార్, ఈ క్లిష్ట సమయంలో సమాజం మొత్తం వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు.దాతలు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని తెలిపారు. విఆర్ఓ సుధాకర్ పాల్గొన్నారు.

# కొవ్వూరు హరినాథ్ రెడ్డి మృతి

వేంపల్లి జూలై 20 ప్రభాతవార్త



మండలంలోని సురభి గ్రామం నాగలగట్టపల్లెలో ఉండే కొవ్వూరు హరినాధ రెడ్డి సోమవారం ఉదయం మృతి చెందారు ఈయన కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతుండగా తన ఇంటి వద్ద సోమవారం మృతి చెందారు ఈయన గతంలో మాజీ సింగల్ విండో అధ్యక్షులుగా పనిచేశారు అలాగే డిసిసి బ్యాంక్ సెంట్రల్ మెంబర్గా పనిచేశారు అలాగే సురభి గ్రామం లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు ప్రజాసేవ కార్యక్రమాలు కూడా చేపట్టారు దీంతో గ్రామంలో ఆయనకు మంచిపట్టు సాధించారు హరినాథ్ రెడ్డి మృతి పట్ల బంధువులు గ్రామంలోని మండలంలోని పలు జనాలు కన్నీరు మునిరై శ్లోక సముద్రంలో మునిగారు ఈయన అం త్య క్రియలు బుధవారం కొనసాగుతాయని బంధువర్గాలు చెప్తున్నారు.

# పెండింగ్ బకాయిలు చెల్లించాలి

దువ్వూరు, జూలై 20, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ పీఆర్సీ, డిఏ బకాయిలు చెల్లించాలని జిల్లా కార్యదర్శి పాలకొండయ్య అన్నారు. సోమవారం వివిధ పాఠశాలలను, హైస్కూళ్ల లోనూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యలు అలాగే ఉన్నాయని వాటిని పరిష్కరించాలన్నారు. రీ సర్వీస్ ఉపాధ్యాయులకు ఆన్ లైన్ విధానంలో టెట్ నిర్వహించాలని, 30% మధ్యంతర భృతి చెల్లించాలని, 12వ పిఆర్సి కమిటీ వేయాలని పేర్కొన్నారు. అలాగే 2003 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం ఇవ్వడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, రామ్మోహన్, రమేష్ నాయుడు, నాగేంద్ర, రామయ్య, దుర్గాప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



## మృత్యుంజయ స్వామి భక్తులకు మెరుగైన సేవలు

చౌడేపల్లి జూలై 20 ప్రభాతవార్త



శ్రీ అభీష్టద మృతుంజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామని గ్రూప్ టెంపుల్స్ ఈవో రమణ అన్నారు సోమవారం ఆయన మృత్యుంజయశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాద వినియోగ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై ఆయన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన సోమవారం రోజున ఆలయంలో ప్రత్యేక ప్రసాద వినియోగం ఉంటుందని ఈవో తెలిపారు. దర్శనానికి వచ్చే భక్తులందరికీ ప్రసాదం సక్రమంగా అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఆలయంలో జరిగే వివిధ పూజలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొనదలచే భక్తులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సేవా టికెట్లను నేరుగా దేవాదాయ శాఖ అధికారి నుంచి మాత్రమే తీసుకోవాలని స్పష్టం చేశారు. అధికారికంగా పొందిన టికెట్లకు మాత్రమే పూజల్లో అనుమతి ఉంటుందని, భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు అనంతరం స్వామివారి పవిత్ర ప్రసాదాన్ని భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది రమణ హరి తదితరులు పాల్గొన్నారు.

## లింగ వివక్షపై అవగాహన



సుండుపల్లి, జూలై 20, ప్రభాతవార్త :

రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు సుండుపల్లి,బి జి రాచపల్లి ఆరోగ్య కేంద్రంలోని ఎఎన్ఎం, సిహెచ్ఓ మరియు ఆశా కార్యకర్తలకు లింగ వివక్ష పై జిల్లా డెమో ఆఫీసర్ భారతి అవగాహనా కల్పిస్తూ లింగ నిర్ధారణ చట్టం రీత్యా నేరం, గర్భస్థ శిశులింగ చట్టం 1994 ప్రకారం చేసిన వారికీ 10000 జరిమానా మరియు ప్రొచ్చహించిన వారుకూడా చట్టరీత్యా నేరస్తుల ని తెలియజేసారు. వైద్యుల సలహా మేరకు మాత్రమే అబార్షన్ కు అర్హులని యు, లింగనిర్ధార్ణ వలన ఆడ శిశువుల చాలా తక్కువ ఉన్నారనియు,ప్రస్తుతం ఆడ పిల్లలు అన్ని రంగాలలో ముందు ఉన్నారని,ఆడ పిల్లను పుట్టానిద్దాం, బ్రతక నిద్దాం, చదవనిద్దాం,ఎదగానిద్దాం అనే నినాదం ముందుకు వెళ్లాలని, ప్రజలకు ఆడ పిల్లల అవస్యత పై అవగాహనా కల్పించాలని చెప్పారు. జిల్లా ప్రోగ్రాం అధికారి మహమ్మద్ తహ మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేసే వైద్యుల వివరాలు మా దృష్టికి తీసుకొని రావాలనియు వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, గ్రామాలలో ఉన్న ఆర్ఎంపి వైద్యులు కేవలం ప్రాథమిక శికిత్స మాత్రమే చేయాలని, తదుపరి చికిత్స చేయరాదనియు,ఆలా చేసిన వారి పై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమం నందు జిల్లా లీగల్ అడ్వైసర్ పరమేశ్వర,శేఖర్ రెడ్డి, వీరనారాయణ, సుగుణమ్మ పార్వతమ్మ మొదలగువారు పాల్గొన్నారు.

## ప్రతిభ అవార్డుకు పూర్ణిమ ఎంపిక

పీలేరు జూలై 20 ప్రభాతవార్త:




పదవ తరగతిలో ఉత్తమ మార్కులు 600కు 582 మార్కులు సాధించి జిల్లా అధికారుల మన్ననలు పొందటమే కాకుండా ప్రతిభ అవార్డుకు ఎన్నిక కావడం పట్ల తండ్రిగా ఆనందం వ్యక్తం చేస్తున్నామని పూర్ణిమ తల్లిదండ్రులు సతీష్ దంపతులు ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యంగా దళిత కుటుంబంలో పుట్టి చాలీచాలని బతుకులతో జీవనం కొనసాగిస్తూ ఉన్నత చదువులు చదివించలేని స్తోమతలో తల్లిదండ్రులు ఉండటం గమనించిన పూర్ణిమ తల్లిదండ్రుల కలలను సాకారం చేసింది.

## కార్యకర్తలే పార్టీకి జీవం : మంత్రి జనార్ధన్‌రెడ్డి

మదనపల్లె, జులై 20 ప్రభాతవార్త:


మంత్రిని సన్మానిస్తున్న దృశ్యం

కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి జీవమని, వారికి న్యాయం చేసే బాధ్యత నాదేనంటూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని రాజంపేట పార్లమెంటరీ కార్యాలయంలో మంత్రి కార్యకర్తలతో అభిప్రాయాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా మంత్రి దృష్టికి పలు సమస్యలను తెచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఐక్యంగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో టిడిపి విజయకేతనం అయ్యేలా చూడాలన్నారు. కష్టకాలంలో పార్టీకి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ళలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీని పటిష్ట పరచాలన్నారు. మంత్రి దృష్టికి తెచ్చిన సమస్యలను మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉర్దూ అకాడమి వైస్‌ఛైర్మెన్ పఠాన్‌ఖాదర్‌ఖాన్, విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ రామక్రిష్ణాచారి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి తులసి, పట్టణ అధ్యక్షులు నాదేళ్ళ అరుణ్‌తేజ్, రూరల్ అధ్యక్షులు శ్రీనివాసులు,ఆర్‌జె.వెంకటేష్, రాటకొండ మధుబాబు, పురుషోత్తంరెడ్డి, ఎరబల్లి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొని పలు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు.

## మొదటిరోజు దస్తావేజు లేఖర్ల రిలే నిరాహార దీక్ష

బద్వేలు, జూలై 20, ప్రభాతవార్త

రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖను ప్రైవేటీకరించడాన్ని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బద్వేలు దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సబ్ రిజిస్టర్ కార్యాలయం దగ్గర రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. జూలై 20 నుంచి 31 వరకు చేపట్టనున్న ఈ దీక్షలలో భాగంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆస్తులను ప్రైవేటీకరణ చేసేందుకు చేపట్టిన జీవో నెంబర్ 396 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా ప్రజల ఆస్తులకు ఎలాంటి రక్షణ ఉండదని వారు వాపోయారు. దీనిని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. తక్షణమే రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన జి.ఓ.ఎంఎస్. నెం.396 ను రద్దు చేయాలని, ప్రజల ఆస్తులకు భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దస్తావేజు లేఖరుల లైసెన్సులను పునరుద్ధరించాలని, లేఖరులు, స్టాంపు వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు, సహాయకుల జీవనోపాధిని కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాలిశెట్టి వెంకటేశ్వర్లు, గోపిశెట్టి వేణుగోపాల్, నరసింహారావు, తిరుపతి లక్ష్మీ నారాయణ, వెంకటసుబ్బయ్య, సురేష్, ఓబులేసు, బాలిశెట్టి శ్రీనివాసులు, నాగేంద్ర రమణారెడ్డి, హజరత్, శ్రీనివాసకుమార్, శివ పాల్గొన్నారు.



# ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి : అర్బన్ సీఐ

పులివెందుల, జూలై 20 ప్రభాతవార్త :

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి అని సైబర్ నేరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలనీ మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలనీ అర్బన్ సీఐ శ్రీరామ్ అన్నారు. సోమవారం పట్టణంలోని జేఎన్‌టీయూ ఏ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ నందు యాంటీ ర్యాగింగ్, సైబర్ సెక్యూరిటీ, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళల భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, చట్టాలపై అవగాహన, సురక్షిత జీవన విధానంపై చైతన్యం కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించా రు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ కె. శ్రీరామ్ మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, విద్యార్థులు ర్యాగింగ్‌కు పూర్తిగా దూరంగా ఉండి స్నేహపూర్వక విద్యా వాతావరణాన్ని నెలకొల్పాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, విద్యార్థులు వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సీఐ సూచించారు. మహిళల భద్రత, గౌరవాన్ని కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. చట్టాలను గౌరవిస్తూ క్రమశిక్షణతో కూడిన బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులు ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎం. మధుసూదన్‌రెడ్డి, తిమోతి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. శేష మహేశ్వమ్మ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతున్న అర్బన్ సిఐ శ్రీరామ్

# జాప్యం లేకుండా పిజిఆర్‌ఎస్ అర్జీలు పరిష్కరించాలి

మదనపల్లె, జులై 20 ప్రభాతవార్త :

జాప్యం లేకుండా పిజిఆర్‌ఎస్ సమస్యలను అర్జీదారుడు సంతృప్తి చెందేలా త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ వేదికలో జిల్లాలో వివిధ మండలాలకు చెందిన ప్రజలు సమస్యలపై 324 అర్జీలను జాయింట్ కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్బంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ ద్వారా అందిన ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణయిత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ ధరఖాస్తులు, బియాండ్ ఎస్‌ఎల్‌ఏ రీఓపనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి ఆయాశాఖల అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ వెంకటేష్, ఎస్‌డిసి చంద్రశేఖర్‌రెడ్డి, సర్వేశాఖ ఏడి శాంతరాజ్ అర్జీలను స్వీకరించారు.


అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

## బిఎల్ఓలు పక్కా జాబితా రూపొందించాలి

కురబలకోట జూలై 20 ప్రభాతవార్త.


సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

సర్ ప్రక్రియలో ఓటర్ల మ్యాపింగ్ ను పక్కాగా అమలు చేయాలని కురబలకోట ఎంపీడీవో గంగయ్య తెలిపారు. సోమవారం కురబలకోట తాసిల్దార్ కార్యాలయంలో బిఎల్వోలు, ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 24 వరకు పొడిగించిందని చెప్పారు. అనర్హుల ఓటర్లను జాబితా జాబితా నుంచి పక్క సమాచారంతో తొలగించాలన్నారు. అర్హులైన వారందరూ పేర్లు జాబితాలో ఉండేలా చేయాలన్నారు. గ్రామాలను శాశ్వతంగా వలస వెళ్లిన వారినీ అక్క సమాచారాలతో తొలగించాలన్నారు. డబుల్ ఎంట్రీలలో ఒక్కదాన్ని తొలగించాలన్నారు. నెల 24 వరకు సర్ ప్రక్రియ ను పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో బాలమూర్తి, ఆర్ఐ శేషాద్రిరావు, వీఆర్వోలు, గ్రామ సెక్రెటరీ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు


అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో నారాయణ రెడ్డి

పీలేరు జూలై 20 ప్రభాతవార్త:

సోమవారం పీలేరు ఆర్డీఓ కార్యాలయంలో "స్పందన" ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. రైతులు, ప్రజలు వివిధ రకాల భూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, సానుకూలంగా స్పందించిన ఆర్డీఓ సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించిన సమయంలోపు సమస్యలు పరిష్కరించి రైతులు, ప్రజలకు న్యాయం చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరసింహ కుమార్ రెవిన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## స్టేట్ ర్యాంకర్‌కు షైనింగ్ స్టార్ అవార్డు



ప్రొద్దుటూరు అర్బన్, జులై 20, ప్రభాతవార్త

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన శ్రీవిద్య జూనియర్ కళాశాల విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు లభించాయి. సోమవారం కడపలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, టీచర్స్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఎంపీసీలో 994 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన కుందా వెంకట గణేష్, ఎంఈసీలో 978 మార్కులు సాధించిన కుంద గీతికలకు రూ.20 వేల నగదు బహుమతి, గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాలు పొందారు. విద్యార్థుల ప్రతిభను ఆర్ఐఓ పీఎల్ఎన్ ప్రకాష్ రావు పట్నాయక్ అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ రమణారావు, డైరెక్టర్లు రామమోహన్, దస్తగిరి విద్యార్థులను అభినందించారు.

## బ్రహ్మంగారిని దర్శించుకున్న ఆప్కో చైర్మన్, డిసిసి

బ్రహ్మంగారి మఠం జూలై 20 ప్రభాతవార్త

జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని సోమవారం ఆంధ్రప్రదేశ్ ఆప్కో చైర్మన్ గన్ని వీరాంజనేయులు, బద్వేల్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మరియు ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి దర్శించుకున్నారు వీరికి మఠం యాజమాన్యం ప్రత్యేక స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు బోల శ్రీనివాసులు ,తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.



### పేదలకు దక్కాల్సిన ప్రతి ఎకరా

## భూమి వారికి దక్కేలా కృషి చేస్తాం



సిద్దవటం జులై 20 ప్రభాతవార్త

రాజంపేట నియోజకవర్గంలో పేదలకు దక్కాల్సి న ప్రభుత్వ భూములు దాదాపు లక్ష ఎకరాలు అన్యాక్రాంతం అయ్యిందని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. మండలంలోని మాధవరం గ్రామపంచాయతీ రోడ్ నెంబర్ 17లో ఆదివారం రాత్రి టీడీపీ ఎన్నారై నాయకులు చలపాటి చంద్ర ఆధ్వర్యంలో ఎస్.కే.ఆర్ నగర్ హరిజనవాడలో నివాసం ఉంటున్న దళితుల భూములకు సంబంధించి దళిత రైతులతో ఆదివారం రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 69 దళిత కుటుంబాలకు చెందిన తాము 2013 సంవత్సరం నుంచి భూముల కోసం పోరాడుతున్నామని విన్నవించారు. ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు మాట్లాడుతూ పేదలకు దక్కాల్సిన ప్రతి ఎకరా భూమి రెవెన్యూ సదస్సు ల ద్వారా పేదలకు న్యాయం చేసి వారికి దక్కేలా కృషి చేస్తానన్నారు. అనంతరం టీడీపీ ఎన్నారై నాయకులు చలపాటి చంద్ర మాట్లాడుతూ 69 దళిత కుటుంబాలకు భూములు వచ్చేలా ఇంచార్జ్ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం మండలం టీడీపీ అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్, ఒంటిమిట్ట జెడ్పీటీసి సభ్యులు ముద్దు కృష్ణారెడ్డి, గంజి సుబ్బరాయుడు, రాజంపేట మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులు ఎద్దుల విజయసాగర్, జనరల్ సెక్రెటరీ వీరనాల రామచంద్ర, సిద్దవటం మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు బాణాల హరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్త్ ను ఏర్పాటు చేశారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



వేంపల్లె జూలై 20 ప్రభాతవార్త

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వీటిని సంరక్షించాల్సి న బాధ్యత అందరిపై ఉందని శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచా సాయినాథ్ వెల్లడించారు. సోమవారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పలు దేవాలయాల ఆవరణాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయి ఆర్గనైజేషన్ సూచనల మేరకు పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి పరిరక్షణ, సమాజ శ్రేయస్సుకు భగవంతున్ని పాద పద్మములకు సమర్పించే ఒక సాముహిక సేవగా ప్రేమతరు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా రెండు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ ఛైర్మన్ నరసింహారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ నరసింహులు, వెటర్నరీ ఏడి డా.రవీంద్రారెడ్డి, ఏపిఎం గురురాజు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, సేవా సమితి సభ్యులు పుల్లగూర గోవర్ధన్, శివకిరణ్, శివరంజని, సునిత తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

దువ్వూరు, జూలై 20, ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వివిధ రకాల సమస్యలను పరిష్కరించాలని తహసిల్దార్ సునీత, ఎంపీడీవోలు సుబ్బారెడ్డిలు అన్నారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సమస్యలపై ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించారు. ఎక్కువగా తమ భూములు ఆన్ లైన్ కావాలని, విద్యార్థులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలు గతంలో సర్వే చేసిన సమయంలో తప్పుగా ఉన్నాయని వాటిని సరి చేయాలని వినతి పత్రాలు అందజేశారు. వీటిని అన్నింటిని సంబంధిత అధికారులకు పంపి నిర్ణిత గడవులోగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఈలు శివకుమార్, సుబ్రహ్మణ్యం, ఏపీ ఓ లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారి అమర్నాధ్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాల గుర్తింపునకు విద్యార్థులే కీలకం



వేంపల్లె జూలై 20 ప్రభాతవార్త

పాఠశాల గుర్తింపునకు విద్యార్థులే కీలకమని స్థానిక నారాయణ విద్యా సంస్థల కరస్పాండెంట్ కె.నారాయణ రెడ్డి వెల్లడించారు. సోమవారం కడపలోని మాధవి కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డులను నారాయణ విద్యా సంస్థ విధ్యార్థిని కె.కీర్తన, డి.కీర్తన లు అందుకున్నారు. ఈ అవార్డులను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగా ప్రధానం చేశారు. రూ.20 వేల చెక్కుతో పాటు సర్టిఫికేట్, మెడల్స్ లను విద్యార్థినిలకు పంపిణీ చేశారు. పదోతరగతి 2026 ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినిలు కె.కీర్తన(587), డి.కీర్తన(579) అత్యుత్తమ ప్రతిభతో విజయాన్ని సొంతం చేసుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ కె.నారాయణ రెడ్డి తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డులను తమ విద్యార్థినిలు దక్కించుకోవడం సంతోషకరమన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్య సాధన దిశగా అడుగులు వేసి భవిష్యత్ లో ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్జేడి శ్యాముల్, డిఇఓ షంషుద్దీన్, ఆర్ఐఓ పట్నాయక్, జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ భానుప్రకాష్, వేంపల్లె ఎంఇఓ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డిజిటల్ డోర్ నంబరింగ్

## పనులు త్వరితగతిన పూర్తి చేయాలి




బద్వేలు అర్బన్, జూలై 20, ప్రభాతవార్త

బద్వేల్ పురపాలక సంఘం పరిధిలో డిజిటల్ డోర్ నంబరింగ్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని పురపాలక కమీషనర్ ఎం.కృష్ణ అధికారులను ఆదేశించారు. ఆదివారం పురపాలక కార్యాలయంలో డిజిటల్ డోర్ నంబరింగ్ కార్యక్రమంపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ డిజిటల్ డోర్ నంబరింగ్ ద్వారా పౌర సేవల అందజేత, ఆస్తుల గుర్తింపు, పన్నుల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలు, పట్టణ ప్రణాళిక మరింత సమర్థవంతంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఇంటికి, వాణిజ్య సముదాయానికి జియోట్యాగింగ్‌తో కూడిన డిజిటల్ డోర్ నంబరింగ్ పూర్తి చేయాలని సూచించారు. వార్డ్ అడ్మిన్లు, అమెనిటీస్ కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి ఇంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వొద్దని ఆదేశించారు. ప్రతిరోజూ పనుల పురోగతిని సమీక్షించి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఈఈ సుమన్ రెడ్డి, ఆర్.ఓ. గంగిరెడ్డి, వార్డ్ అడ్మిన్లు, అమెనిటీస్ కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## పి4తో గ్రామీణ హస్తకళాకారులకు కొత్త ఊతం



మైదుకూరు, జూలై 20, ప్రభాతవార్త:

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనలో భాగంగా గ్రామీణ హస్తకళాకారులను ప్రోత్సహించి వారి జీవనోపాధిని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో పి4 కార్యక్రమం కింద సోమవారం మైదుకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయంలో చౌపాల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ అభివృద్ధి కమిషనర్ (హస్తకళలు) కార్యాలయం, హస్తకళల సేవా కేంద్రం, తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని వనిపెంట, పెద్దశెట్టిపల్లి, అక్కులాయపల్లి గ్రామాలకు చెందిన సుమారు 120 మంది హస్తకళాకారులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన కళాకారులుగా నమోదు చేసుకున్నారు. ఈ నమోదుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ సదుపాయాలు, జాతీయ స్థాయి ప్రదర్శనల్లో పాల్గొనే అవకాశాలు తదితర ప్రయోజనాలు పొందే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.వి. శ్రీధర్ నాయుడు, యంగ్ ప్రొఫెషనల్ వినోద్ కుమార్ పువ్వాడి మాట్లాడుతూ, వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలకు అనుగుణంగా "ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త" అనే లక్ష్య సాధనలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమన్నారు. గ్రామీణ హస్తకళాకారులను ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేయడంతో పాటు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచే దిశగా ఈ కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు.సంప్రదాయ హస్తకళలను పరిరక్షిస్తూ, ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు, ఆర్థిక సంస్థలు, మార్గదర్శులు, ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణ కుటుంబాలను స్వయం ఉపాధి వైపు నడిపించడం పి4 కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి4 మార్గదర్శి, వనిపెంట బ్రాస్ ఇండస్ట్రీ అధ్యక్షులు ఇస్మాయిల్, హస్తకళల సేవా కేంద్రం తిరుపతి ప్రాంతీయ సహాయ మేనేజర్ వినోద్ దెహారు, లేపాక్షి మేనేజర్ ఎఫ్.ఎం. హుస్సేన్ (కడప), ఎస్‌బీఐ ఒనిపెంట శాఖ మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొని హస్తకళాకారులకు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

## 2 ప్రథమ చికిత్స కేంద్రాలు సీజ్

సుండుపల్లి, జూలై 20,ప్రభాతవార్త :




మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆర్ఎంపీ ప్రథమ చికిత్స కేంద్రాలపై జిల్లా అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా నిబంధనలు ఉల్లంగిచ్చిన ధనశ్రీ ప్రథమ చికిత్సా కేంద్రం మరియు శ్రీ సాయి శ్రీనివాస ప్రథమ చికిత్సా కేంద్రాలను 2 గుర్తించి వాటిని అధికారులు సీజ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధికారులు డిఇఎం ఒ,భారతి మరియు డిపిఎంఒ, డాక్టర్ మహమ్మద్ తహ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, అనుమతులు లేకుండా వైద్య సేవలు అందించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని,ఇతర వైద్య సేవలు నిర్వహించరాదని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, అలాగే అత్యవసర వైద్యం అవసరమైన రోగులను సమీప ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ఆసుపత్రులకు తరలించేలా చేయాలని వారికి సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ వైద్య సేవలు అందించే వారిపై భవిష్యత్తులో కూడా చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్,డాక్టర్ పర్వా ఖానం,సూపర్‌వైజర్లు అలివేలమ్మ, సదాశివారెడ్డి, పిహెచ్ఎన్, మాధవిలత ప్రజలు పాల్గొన్నారు.